క్లుప్తంగా

సహజ వనరులను పరిమితంగా వాడుకోవాలి



ద్వారపూడిలో నీటి లభ్యతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న స్వామి ప్రసాద్

కపిలేశ్వరపురం (మండపేట): ప్రకృతిలోని విలువైన సహజ వనరులను పరిమితంగా వాడుకుని భవిష్యత్తు తరాల వారికి బంగారు బాటను వేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ కార్యదర్శి గండి స్వామి ప్రసాద్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండపేట మండలం ద్వారపూడి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం వరల్డ్ వాటర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పలివెల రుద్ర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నీటి ఆవశ్యకత, నీటి కొరత, నీటి సక్రమ వినియోగం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఫ్యాకల్టీ సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రేడ్-5 సెక్రటరీలకు పూర్తి స్థాయి గ్రామాల బాధ్యత



మండల అధికారుల నుంచి గ్రామాల బాధ్యతలు తీసుకుంటున్న గ్రేడ్-5 కార్యదర్శులు

రామచంద్రపురం రూరల్: గ్రామాల్లో 500 జనాభా పైబడిన ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం.11 అనుసరించి రామచంద్రపురం మండలంలో 10 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలను అప్పగిస్తూ రామచంద్రపురం ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తి శుక్రవారం ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎంజీఎస్ఆర్ఎల్ఎస్ఎన్ రాజు, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, గ్రామాల పూర్తి స్థాయి బాధ్యతలను తీసుకున్న కుండ్ల ప్రసాదరెడ్డి, ఆకుల వెంకటేష్, కానెం పెదచిన్నిబాబు, కొల్లి లక్ష్మణరావు, గాడా మహేష్, పంపన లక్ష్మీనారాయణ, కోట వెంకట రామకృష్ణ, ఇమందు వి. సత్యదుర్గాప్రసాద్, నామా త్రిచరణ్, గోనెల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రాన్ని సందర్శించిన డీడీ



కపిలేశ్వరపురంలో డీడీకి స్వాగతం పలుకుతున్న మండల పశువైద్యాధికారి

కపిలేశ్వరపురం: పశుసంవర్ధక శాఖ జిల్లా డీడీ కర్నిడి మూర్తి శుక్రవారం కపిలేశ్వరపురం పశువైద్య కేంద్రాన్ని సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వచ్చిన ఆయన కార్యాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆయనకు మండల పశువైద్యాధికారిణి ఇందు, ఇతర సిబ్బంది స్వాగతం పలికారు. ఆసుపత్రిలోని మందులను రికార్డులతో పోల్చి చూశారు. పాడి పశువులకు అందిస్తున్న సేవలపై పాడిరైతులను అడిగి తెలుసుకున్నారు.

సారా తయారీదారు అరెస్ట్

కపిలేశ్వరపురం: అద్దంకివారిలంకలో నాటు సారా కాస్తున్న వ్యక్తిని శుక్రవారం అంగర పోలీసులు అదుపులోకి తీసుకుని ఆలమూరు కోర్టుకు తరలించారు. అదే గ్రామానికి చెందిన నిందితుడు మిరిమిల్లి శ్రీను నుంచి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలంలో 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ పాత్రలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై అందె పరదేశీ తెలిపారు.

నీటిని కలుషితం చేయవద్దు

రావులపాలెం: నీటిని ప్రతి ఒక్కరూ కలుషితం కాకుండా కాపాడుకోవాలని నీటి ఆవశ్యకతను తెలుసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో ప్రపంచ జల (వాటర్) దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మనిషికి ప్రాణవాయువు ఆక్సిజన్ ఎంత అవసరమో నీరు కూడా అంతే ముఖ్యమైన అవసరమన్నారు. నీటిని ప్రతి ఒక్కరూ కలుషితం కాకుండా కాపాడుకోవాలన్నారు. అనంతరం నీటి భద్రత, వినియోగంపై ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, హరిబాబు, సత్యమూర్తి, హేమలత, సౌజన్య, సిద్ధార్థ, యువరాజ్, రాజేంద్ర, పూజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టూ.. ఒడిసి పట్టు



- సాగునీటి సరఫరాలో శాస్త్రీయత
- రబీ పూర్తయ్యే వరకూ నీటి సరఫరాకు ప్రభుత్వం భరోసా
- రెండు నియోజవర్గాల్లో 1,00,667 ఎకరాల సాగు
- 11,58,33,750 మిల్లీమీటర్ల నీరు అవసరం

కపిలేశ్వరపురం: వరి సాగులో అత్యంత కీలకమైనది సాగునీటి సరఫరా. రబీ సాగు నాట్లు పూర్తయిన నాటి నుంచి పంట చేతికందే వరకూ సాగునీటిని పంట పరిస్థితుల ఆధారంగా ప్రణాళికాబద్ధంగా అందించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. పంట ఆరంభంలోనే వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో దశల వారీగా సమావేశమై పక్కా ప్రణాళికను రూపొందించింది. సజావుగా నీటిని సరఫరా చేస్తోంది. రైతులు అవగాహనతో నీటిని వినియోగించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో రెండు నియోజకవర్గాల పరిధిలో సాగు నీటి సరఫరా తీరుతెన్నులపై ఈ కథనం...

రెండు నియోజక వర్గాల్లో సాగు ఇలా...

ఒక ఎకరా వరి సాగు కాలం మొత్తానికి 1,250 మిల్లీ మీటర్లు నీరు అవసరం. రామచంద్రపురం నియోజవర్గంలో 75 గ్రామాల్లో 53,249 ఎకరాలకు 6,65,61,250 మండపేట నియోజవర్గంలో 43 గ్రామాల్లో 47,418 ఎకరాలకు 4,92,72,500 మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 1,00,667 ఎకరాలకు 11,58,33,750 మిల్లీమీటర్ల సాగునీరు అవసరమవుతుంది.

తోడ్పాటునిస్తున్న సాగు సలహా మండళ్లు

ప్రస్తుత ప్రభుత్వం రూపొందించిన వివిధ దశల్లోని సాగు సలహా మండళ్లు సాగు ప్రక్రియకు తోడ్పాటునిస్తున్నాయి. ఆర్‌బీకే స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ సాగు సలహా మండళ్లను ఏర్పాటు చేసింది. దీంతో స్థానిక రైతు సూచనలు, సలహాలు సైతం ఉన్నత స్థాయిలో తీసుకునే నిర్ణయాల్లో భాగమవుతున్నాయి. ఆ మండళ్లలో రెవెన్యూ, జలవనరులు, వ్యవసాయ శాఖల భాగస్వామ్యం ఉండటంతో పటిష్టమైన నిర్ణయాలకు అవకాశం ఏర్పడుతుంది.

క్షేత్రస్థాయిలో వరి సాగు నీటి అవసరం ఇలా...

మండలం	గ్రామాలు	సాగు విస్తీర్ణం	అవసరమైన నీరు (మి.మీటర్లలో)
రామచంద్రపురం	25	18,806	2,35,07,500
కె.గంగవరం	26	15,656	1,95,70,000
కాజులూరు	26	18,787	2,34,83,750
మండపేట	12	16,892	2,11,15,000
రాయవరం	12	14,646	1,83,07,500
కపిలేశ్వరపురం	19	15,880	1,98,50,000
మొత్తం	120	1,00,667	11,58,33,750

నీటి వినియోగంలో అవగాహన అవసరం



ఎగువ భూములున్న రైతులు ఎక్కువ నీటిని వినియోగిస్తుండటంతో పల్లపు రైతులకు సమస్య ఎదురవుతుంది. దీంతో వారి భూముల్లో దిగుబడి తగ్గే పరిస్థితులొస్తాయి. నేలలో పైరుకు తడి 75 శాతం వరకూ తగ్గిపోతే నీటి ఎద్దడి ఉందంటారు. అవసరం రాకుండా ముందస్తుగా నీరు పెట్టినా ప్రాణవాయువు దక్కక పంట దిగుబడి తగ్గిపోతుంది. నాట్లు వేసేటప్పుడు నీరు పలుచగా, మూన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బుచేయడం పూర్తయ్యే వరకూ 2 సెంటిమీటర్లు నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకూ 5 సెం.మీ నీరుండాలి. ఈనిక దశ, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిలోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త వహించాలి. కోతకు పది రోజులు ముందుగా నీటిని క్రమంగా తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు బాగా చేయదు.

– కేవీఎస్ రమేష్ కుమార్, ఏఓ, కపిలేశ్వరపురం మండలం

పార్టీలో చేరికలపై రాజకీయం తగదు



ఎమ్మెల్సీ తోట సమక్షంలో తాము వైఎస్సార్ సీపీలో ఉన్నామంటున్న మాజీ ఎంపీటీసీ చంద్రావతి, తదితరులు

కపిలేశ్వరపురం: టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఇతర పార్టీల నాయకులను చేర్పించుకోవడమే పెద్ద రాజకీయ కార్యాచరణగా భావించి లేని బలాన్ని ప్రదర్శించాలని చూస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఎద్దేవా చేశారు. ఇటీవల పడమర ఖండ్రిక మాజీ ఎంపీటీసీ పెట్టిం చంద్రావతి, మరికొందరిని మండపేటలోని టీడీపీ కార్యాలయానికి తీసుకెళ్లి టీడీపీలో చేరినట్టు కండువాలు కప్పి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకున్నారని, వాస్తవానికి ఆమె వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతున్నారన్నారు. చంద్రావతి, తదితరులు గురువారం రాత్రి మండపేటలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ తాము వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతున్నామని అన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో కలిసి పని చేస్తామన్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వంగా శ్రీనివాస్, తిరునాతి వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఐదేళ్లుగా ప్రజలకు దూరమయ్యారని, ఎన్నికలు రావడంతో ప్రజల మనిషిగా చెప్పుకునేందుకు జన బలాన్ని చూపించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, మండపేట నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో అన్ని గ్రామాలూ అభివృద్ధి చెందాయన్నారు. టీడీపీకి ఓటమి భయం పట్టుకుందని, ఇతర పార్టీల వారి బలాన్ని తమ బలంగా చూపించే ప్రయత్నాలను మానుకుని ప్రజలకు మేలు చేసే ఆలోచన చేయడమేలన్నారు. సమావేశంలో కవలరాజు, తదితర నాయకులు ఉన్నారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం



స్టిల్‌విల్‌పేట ఇంటింటి ప్రచారంలో సూర్యప్రకాష్ తదితరులు



స్టిల్‌విల్‌పేటలో పూలవర్షంతో సూర్యప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

- ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్
- స్టిల్‌విల్‌పేటలో ఇంటింటా ప్రచారం
- పూలవర్షంతో స్వాగతం పలికిన మహిళలు

రామచంద్రపురం: నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ మాటల్లోనే కాకుండా రాజ్యాంగ పదవుల్లో నిజమైన సామాజిక న్యాయాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసి చూపించారని, రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని 2వ వార్డు స్టిల్‌విల్‌పేటలో సూర్యప్రకాష్ ఇంటింట ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించారు. నవరత్న పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి అందించిన ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటి వద్ద పూలవర్షంతో స్వాగతం పలికారు. పలువురు వైఎస్సార్ సీపీలో చేశారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోను 50 శాతం ఎస్సీ బీసీ, మైనార్టీలకు టిక్కెట్లు ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఆయన అన్నారు. అయిదేళ్ల ప్రభుత్వ కాలంలో బీసీ, ఎస్సీ, మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి వారి అభివృద్ధికి పథకాలు అమలు చేశారన్నారు. మేలు జరిగితేనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేయాలని చెప్పే దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని సూర్యప్రకాష్ అన్నారు. దొమ్మలపాటి లాలిప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో సూర్యప్రకాష్ సమక్షంలో చేరగా వారికి పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, పార్టీ పట్టణ కార్యదర్శి గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు కోటిపల్లి శివాజీ, బొమ్ము మోహన్‌రావు, దొమ్మలపాటి శ్యాం, ఉంద్రాజవరపు దొరబాబు, దొమ్మలపాటి రవిచంద్ర, మందపల్లి చిట్టిబాబు, ములపర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి



గొల్లపాలెంలో మాట్లాడుతున్న కార్యకర్తలు, నాయకులు

కాజులూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ స్థాయిలో విజయం సాధించి రాష్ట్రంలో పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. శుక్రవారం ఆర్యావటం, గొల్లపాలెంలో పలువురు పార్టీ నాయకులు పర్యటించి కార్యకర్తలు, ప్రజలను కలుసుకున్నారు. గొల్లపాలెంలో పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ ఇంటి వద్ద జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి జగనన్న అహర్నిశలు కృషి చేస్తున్నారని నవరత్నాల పథకంలో భాగంగా ఇచ్చిన హామీలతో పాటు అదనంగా మరో 50 కొత్త పథకాలు అమలు చేశారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమైనప్పటికీ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపలేదన్నారు. జగనన్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని అన్నారు. గ్రామాల్లో జగనన్న పథకాలు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడ్డాయో వారికి వివరిస్తూ రానున్న ఎన్నికల్లో వారంతా ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెద్దిరెడ్డి వెంకటరమణ, నిమ్మతి విజయ్, రేఖపల్లి సత్తిబాబు, టేకుమూడి దుర్గారావు, దంగేటి వెంకన్న, ఉంగరాల తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి



తామరపల్లిలో బూత్ కమిటీ సభ్యులతో పరిశీలకుడు శ్రీనివాసరాజు, మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్ తదితరులు

కె.గంగవరం: బూత్ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చింతలపూడి శ్రీనివాసరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని తామరపల్లి, సత్యవాడ, పాణింగపల్లి, యండగండి, కూళ్ల, కోటిపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించి గ్రామ స్థాయిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ కేడర్ మొత్తం సమాయత్తం కావాలన్నారు. బూత్ స్థాయిలో ఉన్న పార్టీ నాయకులు ప్రతి ఒక్క ఓటరు వద్దకు వెళ్లి వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన లబ్ధి, సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలని కోరారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు గ్రామ స్థాయి కార్యకర్తలు, నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. రామచంద్రాపురం నియోజకవర్గ పార్టీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, కోటిపల్లి సొసైటీ అధ్యక్షుడు సాదా వెంగళరావు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వడదెబ్బకు ఓఆర్ఎస్‌తో ఉపశమనం

వేసవిలో తగిన మోతాదులో తాగడం తప్పనిసరి



పి.రత్నకుమారి

కపిలేశ్వరపురం: రెండు నెలలు పాటు ఎండలు మండనున్నాయి. ఇప్పటికే ఉక్కపోత పెరిగింది. శ్రామిక, ఉద్యోగ, వ్యాపారులు మండే ఎండల్లో ఎక్కువగా తిరుగుతుంటారు. శరీరంలో నీటి శాతం తగ్గిపోవడంతో వడదెబ్బకు గురవుతుంటారు. ఇలాంటి ప్రమాదానికి గురికాకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ద్రావకం ఉపకరిస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే ఓఆర్ఎస్ ద్రావణం తయారీపై క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఓఆర్ఎస్ ద్రావణం ప్రాధాన్యతపై కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.రత్నకుమారి మాట్లాడుతూ స్థల, కాలాల ఆధారంగా శరీరాన్ని నిర్దిష్టమైన ఉష్ణోగ్రతలో ఉంచుకోవాలి. మెదడులో హైపో థాలమస్ అనే భాగం శరీరంలోని వేడిని క్రమబద్ధీకరిస్తుంది. తగిన నీటిని తాగకపోయినా, ఎండలో ఎక్కువ తిరిగినా హైపో థాలమస్ భాగమే అధిక ఉష్ణోగ్రతకులోనై క్రమబద్ధీకరించే పని చేయలేదు. ఈ స్థితిలో తల తిరగడం, నీరసం, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్టు అనిపించడం, వాంతి అవుతున్న భావన కలగడం వంటి లక్షణాలుంటే వడదెబ్బకు గురైనట్టు నిర్ధారించవచ్చు. ఓఆర్ఎస్ వివిధ లవణాల మిశ్రమంతో కూడిన 20.5 గ్రాముల పౌడర్ ప్యాకెట్. దీనిలో 2.6 గ్రా. సోడియం క్లోరైడ్, 1.5గ్రా. పొటాషియం క్లోరైడ్ . 2.9గ్రా. సోడియం సిట్రేట్, 13.5 గ్రా. డెక్స్‌ట్రోజ్ ఉంటాయి. ఈ పౌడర్ ప్యాకెట్‌ను సురక్షితమైన లీటరు నీటిలో కలిపి రోజు మొత్తంలో వయస్సును బట్టి తగిన మోతాదులో తాగాలి. సమయానికి ఓఆర్ఎస్ ప్యాకెట్ అందుబాటులో లేకపోతే ఇంటిలోనే ఈ ద్రావకాన్ని తయారు చేసుకోవచ్చు. లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, అర స్పూన్ పంచదార కలిపి సేవించవచ్చు. రెండేళ్లలోపు వారు 50 నుంచి 100 ఎం.ఎల్. ఆరారగా అర స్పూన్ చొప్పున ప్రతి పది నిమిషాలకు ఒకసారి తాగాలి. రెండు నుంచి 10 ఏళ్ల వయస్సు గలవారు 100– 200 ఒక గ్లాస్ వరకూ ఒక స్పూన్ చొప్పున తాగాలి. 10 ఏళ్ల పైబడిన వారు 50 ఎం.ఎల్. (చిన్న గ్లాస్) చొప్పున ఎండలో సంచరిస్తున్న సమయంలో తాగుతూ ఉండాలి.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు

విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కృషి



ఏడిద సీతానగరంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న కర్రి పాపారాయుడు, నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్ గెలుపే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, నాయకులు కరుపూడి రాంబాబు, పోతుల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని ఏడిద సీతానగరం గ్రామంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో వారు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ వరదా చక్రవర్తి, వేగిరాజు గోపాలకృష్ణ, కుంచెన శ్రీను, ఆకుల చిన్న శ్రీను, ఆకుల పుల్లయ్య, ర్యాలి సూరిబాబు, కసిరెడ్డి శ్రీను, అడ్డాల సూర్యానారాయణరాజు, చిక్కాల రాంబాబు, వెలుకొండ వీరబాబు, పీవీ గోవిందరావు పలు అంశాలపై మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్షాల కుట్రలను ఎదుర్కొంటూనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను మరోసారి తెచ్చుకునే ఆవశ్యకతను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు.

గ్రామీణ పేదల ఆరోగ్య రక్షణకు జాస్

ఆలమూరు: రాష్ట్రంలోని గ్రామీణ పేద ప్రజల ఆరోగ్య రక్షణకు, మెరుగైన చికిత్స కోసం ఈ ఏడాది జనవరి నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్)ను ప్రవేశ పెట్టిందని ప్రత్యేక వైద్య నిపుణులు జి.దుర్గా ప్రసాద్, మేఘ స్పందన, నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని చింతలూరులో శుక్రవారం జాస్ ఫేజ్–2 కార్యక్రమం జరిగింది. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది సుమారు 187 మందికి వైద్య సేవలను అందించి మందులు అందజేశారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య సలహాలు అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిని ఆరోగ్యశ్రీలో భాగంగా రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వెంకటరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, హెల్త్ అసిస్టెంట్ ఆర్.నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ వి.సువర్చల, ఎంపీహెచ్ఏలు పి.కృష్ణవేణి, ఎస్.రాణి ప్రియదర్శిని, ఆరోగ్య మిత్ర నామాల రామకృష్ణ, ఆరోగ్య ఆశ సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

దేవస్థానం భూముల్లో అక్రమంగా చెరువు తవ్వకం

ఎస్సైకి ఫిర్యాదు చేసిన దేవస్థానం అధికారులు

రాయవరం: మాచవరం గ్రామంలో దేవుని కాలనీకి సంబంధించిన దేవస్థానం భూముల్లో అక్రమంగా చెరువు తవ్వకంపై రాయవరం ఎస్సై జి.నరేష్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే మాచవరం దేవునికాలనీ వాసులు స్థానికంగా ఉన్న దేవస్థానం భూమిలో అక్రమంగా చెరువు తవ్వి దీనిలోకి కాలనీ వాసుల ఇళ్ల నుంచి వాడకం నీరు పంపిస్తున్నారంటూ దేవస్థానం అధికారులు రాయవరం ఎస్సైకి ఫిర్యాదు చేశారు. దీనిపై రాయవరం ఎస్సై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అమ్మవారి రథోత్సవం



మోరి పురవీధుల్లో సాగుతున్న రథయాత్ర

సఖినేటిపల్లి: మండలంలోని మోరిలో కొలువైన మహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాలక్ష్మమ్మ అమ్మవారి రథయాత్ర ముప్పర్తి వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయం నుంచి అమ్మవారిని మంగళ వాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో పూలతో శోభాయమానంగా అలంకరించిన రథంపైకి అధిరోహింపజేశారు. మోరి, మోరిపోడు గ్రామాల్లోని పురవీధుల్లో ఈ యాత్ర కొనసాగింది. యాత్ర పొడవునా భక్తులు అమ్మవారికి అరటిపళ్ల నైవేద్యాలుగా సమర్పించుకున్నారు. అలాగే రథానికి అరటిగెలలు, గుమ్మిడి కాయలు కట్టించుకుని మొక్కులు తీర్చుకున్నారు. యాత్రలో దేవతామూర్తుల వేషధారణలు, శక్తి వేషాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సర్పంచ్ పసలపూడి లక్ష్మీ పద్మమంగతాయారు, చేనేత ప్రతినిధి జాన శంకరరావు, అత్యధిక సంఖ్యలో స్థానికులు, సరిహద్దు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో భాగంగా మాంగళ్యధారణ చేస్తున్న అర్చకులు

మామిడికుదురు: మాకనపాలెంలో కొలువుదీరిన అనంతలక్ష్మి, భూదేవీ సమేత సత్యనారాయణస్వామి 72వ వార్షిక దివ్య తిరు కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. మద్దాల సతీష్, కాత్యాయని దంపతులు కల్యాణకర్తలుగా పాల్గొని స్వామి వారి వార్షిక కల్యాణాన్ని రమణీయంగా జరిపించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, కర్పూర పరిమళ సుగంధ ద్రవ్యాల పరిమళాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామి వారి కల్యాణం ఆద్యంతం కనులపండువలా నిర్వహించారు. మద్దాల దొరబాబు ముత్యాల తలంబ్రాలను స్వామి, అమ్మవార్లకు కానుకగా సమర్పించారు. ఉభయదేవేరులతో కొలువుదీరిన స్వామిని గురువారం రాత్రి గరుడ వాహనంపై ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం పలువురు భక్తులు స్వామి వారి వ్రతాలు ఆచరించారు. మొక్కులు, అభిషేకాలతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆంజనేయ పుష్పక వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని వైభవంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పి.గన్నవరం: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించడంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పి.గన్నవరం గ్రేస్ విద్యాసంస్థల డైరెక్టర్ నల్లి శ్రీచరణ్ అన్నారు. స్థానిక గ్రేస్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ ఈవెంట్స్ జరిగాయి. రన్నింగ్, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరచిన 30 మంది విద్యార్థులకు నెహ్రూ యువకేంద్రం వలంటీర్ గాదంశెట్టి బేబీ సరోజిని సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మలుపు



ద్రాక్షారామలో ప్రమాదకరంగా ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయ రహదారి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ ప్రధాన రహదారి నుంచి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇటీవల ప్రధాన రహదారి అభివృద్ధిలో భాగంగా ఇక్కడ మురుగునీరు పారేందుకు తూరలు వేసేలా రోడ్డును తవ్వారు. దీంతో మలుపు తిరిగేందుకు ప్రమాదకరంగా తయారయింది. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.